నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, మంగళవారం 3 సెప్టెంబర్ 2024 | NIZAMABAD



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 41 గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద నీరు



యంచలో కూలిన ఇల్లు

### దెబ్బతిన్న ఇండ్లు..

ఎడతెరిపి లేని వానల కారణంగా పెద్ద సంఖ్యలో నివాసాలు నేలకూలాయి. కామారెడ్డి జిల్లాలో 60 ఇండ్లు, 15 గుడిసెలు నేలమట్టమయ్యాయి. 10 ఆవాస కేంద్రాలను ఏర్పాటు చేసి 1776 మందికి వసతి కల్పించారు. బోధన్ డివిజన్‌లో 31 ఇండ్లు కూలిపోయినట్లు ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ తెలిపారు. ఆర్మూర్ డివిజన్‌లో 18 ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయని ఆర్డీవో రాజాగౌడ్ తెలిపారు.

- భారీ వానలతో రైతులకు తీరని కష్టాలు
- నీట మునిగిన 1.50 లక్షల ఎకరాలు
- వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- రైతులను గాలికొదిలేసిన వ్యవసాయ శాఖ
- కూలిన నివాసాలు.. రోడ్డున పడ్డ జనాలు
- పత్తా లేని ప్రజాప్రతినిధులు

# కన్నీటి వర్షం

**భారీ వర్షాలు అన్నదాతల ఆశలను** నిండా ముంచాయి. వేలాది ఎకరాల్లోని పంటలు వరదనీట మునిగాయి. మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వానలతో చెరువులు, కుంటలు ఉప్పొంగడంతో వర్షపు నీరు పొలాల్లోకి చేరింది. ప్రాథమిక సమాచారం ప్రకారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 1.5లక్షల ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి. కష్టాల్లో ఉన్న రైతులు, ప్రజలను అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకున్న దాఖలాల్లేవు. వ్యవసాయ అధికారులైతే అన్నదాతలను గాలికొదిలేశారు. వానలతో పాటు వరద తగ్గుముఖం పడితే కానీ ఎంత నష్టం జరిగిందని అంచనా వేసే పరిస్థితి లేదని చెబుతున్నారు.

–నిజామాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# మహోగ్ర గోదావరి

- భారీ వర్షాలతో పోటెత్తిన వరద
- ఎస్సారెస్పీకి 2.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 41 గేట్లు ఎత్తి దిగువకు విడుదల



నవీపేట మండలం యంచ వద్ద గోదావరి ఉధృతి

## ఉరకలెత్తుతున్న మంజీరా

మోర్తాడ్/రెంజల్/బోధన్ రూరల్, సెప్టెంబర్ 2: గోదావరి మహోగ్ర రూపం దాల్చింది. మంజీర పరవళ్లు తొక్కింది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. విష్ణుపురి, బాలేగాం, ఇతర ప్రాజెక్టులు పూర్తిగా నిండడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదలచేశారు. దీంతో కందకుర్తి సమీపంలోని రెంజల్ మండలంలోని గోదావరి, హరిద్రా, మంజీరా నదులు ఉగ్రరూపం దాల్చాయి. నదిపై నిర్మించిన హైలెవెల్ వంతెనను ఆనుకొని వరద పోటెత్తింది. నదిలోని పురాతన శివాలయం గుడి, శిఖరంపై నుంచి సుమారు 4 అడుగుల ఎత్తుతో నీరు ప్రవహించింది.

**ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద**

పోచంపాడ్ వద్ద ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. 2.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో సోమవారం ఉదయం గేట్లను ఎత్తారు. రాత్రి 8గంటలకు 3 లక్షలకు పైగా ఇన్‌ఫ్లో కొనసాగడంతో 41 గేట్ల ద్వారా 3.14 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదిలారు. ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, 1088 అడుగులు (72.99 టీఎంసీలు) మేర నీటి నిల్వను కొనసాగిస్తూ, మిగిలిన నీటిని వచ్చినట్లు దిగువకు విడిచి పెడుతున్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగేనవార్, నిర్మల్ ఎస్పీ జానకీషర్మిళ, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఎస్ఈ శ్రీనివాస్ రావు, ఈఈ చక్రపాణిలతో ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్‌పైకి ఎవరిని రాకుండా చూడాలని, గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.



సాలూర పాత వంతెన వద్ద పరవళ్లు తొక్కుతున్న మంజీరానది

**మంజీరకు జలకళ**

నిన్నటిదాకా బోసిపోయిన మంజీరా నది ఇప్పుడు పరవళ్లు తొక్కుతున్నది. మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నిండుగా ప్రవహిస్తున్నది. బోధన్ మండలం సాలూర వద్ద ఉన్న పాత వంతెనను తాకుతూ వరద ప్రవాహం కొనసాగుతున్నది. దీంతో అటువైపు వెళ్లే వాహనాలను నియంత్రిస్తున్నారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో అధికారులు మహారాష్ట్ర వైపు రాకపోకలను నిలిపివేశారు. రెంజల్ మండలం కందకుర్తి వద్ద ఉన్న అంతర్రాష్ట్ర వంతెనను తాకుతూ గోదావరి ప్రవహిస్తుండడంతో వాహనాలను అనుమతించడం లేదు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రెంజల్ పోలీసులు బారికేడ్లను అడ్డం పెట్టి వాహన రాకపోకలను నిలిపి వేశారు.



మోర్తాడ్ మండలం గాండ్లపేట్ శివారులో నీట మునిగిన వరిపైరు

**ఆరుతడి పంటలకు దెబ్బ..**

భారీ వర్షాలతో ప్రధానంగా ఆరుతడి పంటలు దెబ్బతిన్నాయి. వాగులు, ఒర్రెల పక్కన పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. జుక్కల్ నియోజకవర్గంలో మక్కజొన్న, వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. పెద్దకొడప్‌గల్, పిట్లం, జుక్కల్, బిచ్కుంద తదితర మండలాల్లో వందలాది ఎకరాల్లో మక్క దెబ్బ తిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. హన్మాజీపేట్, సంగోజీపేట్, కాద్లాపూర్ శివారులో సాగు చేస్తున్న మొక్కజొన్న, సోయా, పత్తి పంటలు నీట మునిగాయి. ఇబ్రహీంపేట్, రాంపూర్, దేశాయిపేట్, సోమేశ్వర్ తదితర గ్రామాలలో వరి పంటలు సైతం నీట మునిగాయి. వ్యవసాయ భూముల్లో వరద నీటిని నిలకడ లేకుండా చూసుకోవాలని వ్యవసాయ శాఖ చెబుతున్నది.



పెద్దకొడప్‌గల్ మండలంలో దెబ్బతిన్న మక్కజొన్న పంట

**పత్తాలేని ప్రజాప్రతినిధులు..**

భారీ వర్షాలతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షల ఎకరాల్లో వరి పంటలైతే కనిపంచకుండా వరద నీటిలో మునిగాయి. ప్రతి గ్రామంలో వ్యవసాయ భూములు చెరువును తలపిస్తున్నాయి. రైతుల భూముల్లో ఇసుక మేటలు తేలుతున్నాయి. నెల రోజుల్లో చేతికి వస్తుందనుకున్న పంట నీటిపాలు కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆపత్కాలంలో అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు ఒక్కరూ రాలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవ్వరూ జనాల్లోకి వెళ్లి వారి కష్ట, నష్టాలను తెలుసుకునే ప్రయత్నమే ఉమ్మడి జిల్లాలో చేయలేదు.

- జనం హైరానా
- మూడు రోజులుగా వీడని వర్షాలు
- ఉమ్మడి జిల్లాలో భారీగా నష్టం
- కూలిన ఇండ్లు.. ధ్వంసమైన రోడ్లు
- నీట మునిగిన పంటలు
- గ్రామాలకు నిలిచిన రాకపోకలు

# ఎడతెగని వాన



లింగంపేట మండలం నాగారం వంతెనకు ఇరువైపులా కోతకు గురైన రహదారి



పోచారం ప్రాజెక్టు నుంచి వస్తున్న వరదతో నిండుగా ప్రవహిస్తున్న పెద్దవాగు



అమీర్‌నగర్ శివారులో తెగిపోయిన రోడ్డు

నమస్తే యంత్రాంగం, సెప్టెంబర్ 2: భారీ వర్షాలు తెరిపినివ్వడం లేదు. మూడు రోజులుగా కురుస్తున్న వానలతో చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయి. ప్రజలకు, అన్నదాతలకు అంతులేని కష్టాలు తెచ్చిపెట్టాయి. ఉమ్మడి జిల్లాలో మరిన్ని భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో మంగళవారం కూడా విద్యాసంస్థలకు బంద్ ప్రకటించారు. ఇక, గడిచిన 24 గంటల్లో నిజామాబాద్ జిల్లాలో 8 సెం.మీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సిరికొండలో 17.21, ముప్కాల్‌లో 13, మెండోరా, మోర్తాడ్ మండలాల్లో 10 సెం.మీటర్లకు పైగా వర్షం కురిసింది.

**నేడూ విద్యాసంస్థల బంద్**

కామారెడ్డి/ఖలీల్‌వాడి: అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం కూడా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. విద్యార్థులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో మంగళవారం కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు రాజీవ్ గాంధీ హనుమంతు, ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు.



వరద ఉధృతికి ధ్వంసమైన అన్నారెడ్డిపల్లి రహదారి

**నిండుకుండల్లా ప్రాజెక్టులు..**

నిజాంసాగర్ మినహా ఉభయ జిల్లాల్లోని ప్రాజెక్టులన్నీ పూర్తిగా నిండాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తడంతో 41 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. పోచారం ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో అలుగు పారుతున్నది. చారిత్రక కట్టడం నుంచి ప్రవహిస్తున్న వరదను చూసేందుకు జనాలు తరలిరాగా, రక్షణ చర్యల్లో భాగంగా పోలీసులు అనుమతించలేదు. కళ్యాణి ప్రాజెక్టు నుంచి 600 క్యూసెక్కులు, సింగీతం నుంచి 10,500 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నిజాంసాగర్‌కు 57,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9 టీఎంసీలకు చేరింది. సింగూర్ ప్రాజెక్టు 29.917 టీఎంసీలకు గాను 18.202 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకుంది. భారీగా వరద వస్తుండడంతో అలీసాగర్ జలాశయం ఒక గేటును ఎత్తారు.

## నవజాత శిశువు మృతి

### బాన్సువాడ ఎంసీహెచ్‌లో ఘటన

### వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని కుటుంబ సభ్యుల ఆరోపణ

బాన్సువాడ, సెప్టెంబర్ 2: బాన్సువాడలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో విషాదం చోటు చేసుకుంది. గర్భిణికి సిజేరియన్ చేస్తుండగా శిశువు మృతి చెందింది. అయితే, వైద్యుల నిర్లక్ష్యం వల్లే పాప మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత వర్నికి చెందిన అంజయ్య భార్య సోనీ నిండు గర్భిణి. మూడ్రోజుల క్రితం ఆమెను మాతాశిశు సంరక్షణ కేంద్రానికి తీసుకురాగా, సాధారణ ప్రసవం కోసమని వేచి చూద్దామని వైద్యులు చెప్పారు. రెండు రోజులు గడిచినా డెలివరీ కాకపోవడంతో సిజేరియన్ చేయాలని కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం వైద్యులను కోరారు. డాక్టర్లు సాయంత్రం వేళ సిజేరియన్ చేయగా, మగ శిశువు మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బిడ్డ మరణించాడని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎంత మొత్తుకుంటున్నా సిజేరియన్ చేయలేదని, పొద్దున్నే ఆపరేషన్ చేసి ఉంటే బిడ్డ బతికేవాడని అంజయ్య వాపోయాడు. ఈ ఘటనపై సూపరింటెండెంట్ విజయలక్ష్మిని వివరణ కోరగా, గర్భిణి ఆరోగ్యంగా ఉందని, నార్మల్ డెలివరీ కోసం సోమవారం ఉదయం మందులు ఇచ్చామన్నారు. సోనీ పరిస్థితి చూసి సాయంత్రం సిజేరియన్ చేయగా, అప్పటికే శిశువు ఉమ్మి మింగి చనిపోయాడని వివరించారు. దవాఖానలో ముగ్గురు గైనకాలజిస్టులు ఉండగా, ఒకరు ఇటీవలే రిజైన్ చేశారన్నారు. మిగిలిన ఇద్దరు డ్యూటీలో ఉన్నారని తెలిపారు.



చిన్నారి మృతితో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



వేల్పూర్,రామన్నపేట్ గ్రామాల మధ్య వరద నీటి ప్రవాహానికి ధ్వంసమైన రోడ్డు

## గోదావరి మధ్యలో బిక్కుబిక్కుమంటూ..



ముప్కాల్/ఏర్గట్ల, సెప్టెంబర్ 2: గోదావరికి వరద పోటెత్తడం, శ్రీరాంసాగర్ గేట్లను ఎత్తడంతో మెండోరా మండలం సావెల్ శివారులోని కుర్రు సాంబయ్య ఆశ్రమంలో ముగ్గురు చిక్కుకు పోయారు. గోదావరి నది, పెద్దవాగు కలిసే ప్రాంతంలో ఎత్తయిన కుర్రులో ఉండే ఈ ఆశ్రమం చుట్టూ నీరు చేరడంతో మహారాష్ట్రకు చెందిన ముగ్గురితో పాటు ఆవులు, గుర్రం చిక్కుకుపోయాయి. తమను రక్షించాలని బాధితులు ఆర్తనాదాలు చేయగా, అధికారులు రంగంలోకి దిగారు. ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఎఫ్, పోలీసులు అక్కడకు చేరుకుని వారిని రక్షించేందుకు చర్యలు చేపట్టారు. ముగ్గురిని సురక్షితంగా తడ్‌పాకల్ వద్ద ఒడ్డుకు చేర్చారు.

## వాగులో పడి వృద్ధుడి మృతి

బీబీపేట్/మాచారెడ్డి, సెప్టెంబర్ 2: ఎడ్లకట్టవాగు ఉధృతికి గల్లంతైన ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. పాల్వంచ మండలం మథనిదేవుపల్లికి చెందిన కామిటి నర్సయ్య (60) భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో ఉండే కూతురి ఇంటికి ఆదివారం వెళ్లాడు. రాత్రి బీబీపేటకు వచ్చే క్రమంలో మాందాపూర్ శివారులో ఎడ్లకట్టవాగును దాటే క్రమంలో వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. సోమవారం ఉదయం వాగు ఒడ్డున నర్సయ్య మృతదేహం తేలడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డికి తరలించారు.

**దొరకని ఆచూకీ..**

చేపల వేటకు వెళ్లి లచ్చాపేట గ్రామశివారులోని వాగులో ఆదివారం గల్లంతైన కైరంకొండ శివరాములు ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రిస్క్యూ టీం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొన్నది. అటు ఎగువ మానేరులోనూ గంభీరావుపేట పోలీసులు గాలిస్తున్నారు.



నర్సయ్య మృతదేహం